అర్జీదారుల సమస్యలపై అధికారులు నిర్లక్ష్యం వహించరాదు

క్షేత్ర స్థాయిలో పర్యటించి అర్జీలు పరిష్కరించాలి
అర్జీల సమాచారం కోసం అర్జీదారులు 1100 కాల్ చేసి తెలుసుకోవాలి
పిజిఆర్ఎస్‌కు 232 అర్జీలు కలెక్టర్ విజయక్రిష్ణన్

విశాలాంధ్ర-అనకాపల్లి కలెక్టరేట్ : ప్రజా పిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పి.జి.అర్.ఎస్.) లో వచ్చిన అర్జీలను అధికారులు వ్యక్తిగతంగా క్షేత్ర స్థాయిలో పర్యటించి అర్జీలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన పి.జి.అర్.ఎస్. కార్యక్రమంలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఎం. జాహ్నవి, ప్రత్యేక ఉప కలెక్టర్ (ఏ పీ ఐ ఐ సి) అనిత లు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుండి తీసుకున్న అర్జీల గురించి వెంటనే సంబంధిత అదికారులను వివరాలు అడిగి తెలుసుకొని, వాటి పరిష్కారానికి సత్వరమె చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అర్జీదారుల సమస్యలపై నిర్లక్ష్యం వహించరాదు అధికారులకు సూచించారు. అనంతరం పరిస్కారం కాని అర్జీల పై సమీక్ష నిర్వహిస్తూ ప్రజల నుండి వచ్చిన అర్జీలను నిర్ణిత సమయంలో పరిష్కరించాలని ఆమె తెలిపారు. ప్రజలు అందజేసిన ధరఖాస్తుల పరిష్కారానికి అర్జీదారులతో నేరుగా మాట్లాడాలన్నారు. పరిష్కరించిన వినతులను ధరఖాస్తుదారునికి తెలియజేయాలని, పరిష్కారం కాని అర్జీల గూర్చి వారికి అందుకుగల కారణాలు వివరంగా, %శ్రీ%తెలియజేయడం ద్వారా అర్జీలు రీ ఓ పెన్ కాకుండా నివారించవచ్చని తెలిపారు. పి జి ఆర్ ఎస్ అర్జీలు జిల్లా అధికారి లాగిన్ లో ఉంటే జిల్లా అధికారి మండల అధికారి లాగిన్ లో ఉంటే మండల అధికారి నేరుగా క్షేత్ర స్థాయి పర్యటనకు వెళ్లి, ప్రజల సమస్యలను క్షేత్ర స్థాయిలోనే పరిష్కరించాలని అధికారులను సూచించారు. ప్రతి శాఖ అధికారి వారి శాఖకు సంబంధించిన అర్జీల పరిష్కార పరిస్థితిని ప్రతిరోజు పర్యవేక్షణ చేసి నిర్ణిత సమయంలో చర్యలు తీసుకోవాలన్నారు, సమర్పించిన అర్జీల సమాచారం కోసం అర్జీదారులు తమ అర్జీల సమాచారం కోసం 1100 కాల్ చేసి తెలుసుకోవచ్చని కలెక్టర్ అర్జీదారులకు సూచించారు. ఈ రోజు జరిగిన పి.జి.అర్.ఎస్.లో 232 అర్జీలు స్వీకరించడం జరిగిందని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కె ఆర్ ఆర్ సి, భూపరిపాలన ప్రత్యేక ఉప కలెక్టర్లు ఎస్ సుబ్బలక్ష్మి, రామ మణి, జిల్లా విద్యా శాఖ అధికారి గిడ్డి అప్పారావు నాయుడు, జిల్లా గృహ నిర్మాణ, డ్వామా, డిఆర్డిఎ పథక సంచాలకులు శ్రీనివాస్, పూర్ణిమ దేవి, శచి దేవి, జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి వి.సుదీర, వివిధ శాఖ ల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



విశాలాంధ్ర అనకాపల్లి

మంగళవారం 9, సెప్టెంబర్ 2025

ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు బాబ్జి

విశాలాంధ్ర-అనకాపల్లి: అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో స్థానిక నాలుగు రోడ్ల జంక్షన్ అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు బి.బాబ్జి మాట్లాడుతూ. రాష్ట్ర మంత్రి మండలి సమావేశంలో ప్రభుత్వం తీసుకున్న వైద్య కళాశాలల పీపీపీ విధాన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. పీపీపీ విధానం అమలు చేస్తే వందలాది మంది ప్రతిభగల విద్యార్థులకు ఎంబీబీఎస్ విద్య దూరమౌతుందని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో 17 వైద్య కళాశాలల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదిస్తే... అప్పటి సీఎం జగన్మోహన్రెడ్డి 14 వైద్య కళాశాలకు శంకుస్థాపన చేశారని గుర్తుచేశారు. రాజమహేంద్రవరం, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాల, విజయనగరం జిల్లాల్లో గత విద్యా సంవత్సరంలో కళాశాలలను ప్రారంభించారన్నారు. జగన్ ప్రభుత్వం 107, 108 ఉత్తర్వుల్ని తీసుకువచ్చి నూతన మెడికల్ కళాశాలల్లో 50 శాతం ఎంబీబీఎస్ సీట్లను బీ, సీ కేటగిరీలుగా విభజించి... బీ-కేటగిరీ రూ.12 లక్షలకు, సీ కేటగిరి రూ.25 లక్షలకు విక్రయించడం వల్ల అనేకమంది పేద ప్రతిభా విద్యార్థులు వైద్య విద్యకు దూరమవుతానన్నారు. .కూటమి ప్రభుత్వంలో కీలక నేతగా వ్యవహరిస్తున్న విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్... నాడు తన సొంత మంగళగిరి నియోజకవర్గంలో జరిగిన యువగళం పాదయాత్రలో... తాము అధికారంలోకి వచ్చాక జీవో నెంబర్ 107, 108 100 రోజుల్లోనే రద్దు చేసి వైద్య కళాశాలలను నూరుశాతం ప్రభుత్వ కళాశాలలుగా కొనసాగిస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చాక పీపీపీ విధానాన్ని తీసుకొచ్చి వైద్య కళాశాలలను కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని దుయ్యబట్టారు. దీనివల్ల కేవలం నష్టపోయేది విద్యార్థులు మాత్రమే కాదు... అనేకమంది పేద వర్గాల ప్రజలు కూడా ఉచిత వైద్యానికి దూరమవుతారన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో పీపీపీ విధానం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అనాలోచిత నిర్ణయాన్ని తక్షణ మే వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో కూటమి ప్రభు త్వం చేస్తున్న మోసాన్ని విద్యార్థుల్లోకి తీసుకెళ్లి రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున ఆందో ళనలు చేపడతామని బాబ్జీ హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వి. రాజు ఏఐఎస్ఎఫ్ నియోజవర్గ నాయకులు లతా, సీత, నవ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రామకృష్ణను కలిసిన టీడీపీ మండల అధ్యక్షుడు శ్రీనివాసరావు

విశాలాంధ్ర-కశింకోట: మాజీమంత్రి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణను టీడీపీ మండల అధ్యక్షుడు గొంతిన శ్రీనివాసరావు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అందరినీ కలుపుకుని వెళ్ళే శ్రీనివాసరావుకు టిడిపి మండల అధ్యక్షుడు కావడం శుభపరిణామం అన్నారు. శ్రీనివాసరావు మరిన్ని పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.ముందుగా ఎమ్మెల్యే కొణతాలను శ్రీనివాసరావు సత్కరించారు.నూతనంగా ఎన్నికైన శ్రీనివాసరావును ఎమ్మెల్యే సత్కరించి, జ్ఞాపిక అందచేసారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఉగ్గిన రమణమూర్తి, సిదిరెడ్డి శ్రీనివాసరావు, ఉల్లింగల రమేష్, నయనం శెట్టి రమణారావు, నారిపల్లి ప్రసాద్,గంజి కుమార్ ఉన్నారు.

భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం

విశాలాంధ్ర- సబ్బవరం: మండలంలోని సోమవారం కురిసిన భారీ వర్షానికి మండల కేంద్రంలోని లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. సబ్బ వరం మండల కేంద్రంలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో భారీ వర్షం కారణంగా సబ్బవరం ఎన్టీఆర్ సర్కిల్,పాత సబ్బవరం జంక్షన్, ఆర్ టి సి కాంప్లెక్స్,పోలీస్ స్టేషన్‌లు వర్షం నీటికి ముంపు నకు గురయ్యాయి. దీంతో ఆయా కార్యాలయాల సిబ్బంది, ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు లోతట్టు ప్రాంతాలలో వర్షం నీరు నిల్వలేకుండా ఉండడానికి చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. చిన్నచిన్న అకాల వర్షాలకే లోతట్టు ప్రాంతాలు వర్షం నేటితో మునిగిపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అలాగే రానున్న వర్షాకాలంలో మరింత ఇబ్బందులు అయ్యే అవకాశాలు ఉన్నా యని, తక్షణమే సంబంధిత అధికారులు తగు చర్యలు చేపట్టాలని గ్రామ ప్రజలు, కోరుతున్నారు.

జిల్లా కేంద్రంగా నూతనంగా ఎస్సీ మహిళ వసతిగృహం ఏర్పాటు చేయాలి : ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర-అనకాపల్లి: అనకాపల్లి జిల్లా కేంద్రంగా నూతనంగా ఎస్సి మహిళ వసతి గృహంను ఏర్పాటు చేయాలని కోరుతూ తాడేపల్లిలో ఉన్న రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయంలో డైరెక్టర్ లావణ్య వేణి కి ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఫణీంద్ర కుమార్ మాట్లాడుతూ. అనకాపల్లి జిల్లా నూతనంగా ఏర్పడిన అనంతరం అనేకమంది విద్యార్థులు దూర ప్రాంతాల నుంచి విద్యను అభ్యసించడానికి అనకాపల్లి జిల్లా కేంద్రానికి వస్తున్నారు. కానీ అనకాపల్లి జిల్లా కేంద్రంలో ఒకే ఒక బీసీ మహిళ వసతిగృహం ఉంది. అందులో కూడా 100మంది విద్యార్థులు ఉండాల్సి ఉంటే దాదాపు 200మంది విద్యార్థులు ఉంటూ అనేక ఇబ్బం దులు ఎదుర్కొంటూ విద్యను అభ్యసిస్తున్నారని అన్నారు. అనేకమంది విద్యార్థులు వసతి గృహంలో ఖాళీ లేక తిరిగి ఇంటి ముఖం పడుతున్నారన్నారు. విద్యార్థుల సమస్యలను దృష్టిలో పెట్టుకొని జిల్లా కేంద్రంగా మరొక ఎస్సి మహిళ వసతి గృహము ఏర్పాటు చేయాలని అనేకసార్లు జిల్లా అధికారులకు విన్నవించుకున్న ఎటువంటి ప్రయోజనం లేదు కాబట్టి ఇప్పటికైనా రాష్ట్ర ఉన్నత అధికారులు స్పందించి నూతన ఎస్సీ మహిళ వసతి గృహమును అనకాపల్లి జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేసి విద్యార్థులకు చదువుకోడానికి సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శశి, రాష్ట్ర సమితి సభ్యులు బన్నీ, అజయ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు..

సమస్యలపై చర్చించకుండా రాజకీయాలా..?

జడ్పిటిసి పై పలువురు సభ్యులు ఆగ్రహం

విశాలాంధ్ర-కేకోటపాడు: గ్రామాల్లో సమస్యలపై చర్చించకుండా రాజకీయాలు మాట్లాడటం భావ్యం కాదని , ప్రభుత్వం నుండి వచ్చే పథకాలు సామాన్యులకు అందుతున్నాయా లేదా అని చూడవలసిన బాధ్యత ప్రజాప్రతినిధుల పై ఉందని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీవో సమావేశ మందిరంలో ఎంపీపీ రెడ్డి జగన్మోహన్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జడ్పిటిసి సభ్యురాలు ఈర్లే అనురాధ మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వంలో పథకాల కన్నా సమస్యలు ఎక్కువగా ఉన్నాయని అన్నారు. చౌడువాడ సర్పంచ్ దాడి ఎరుకనాయుడు అడ్డు తగులుతూ వైకాపా హయాంలో చేసింది తక్కువ ఆర్భాటం ఎక్కువ అంటూ సమావేశానికి ఏనాడూ రాని జడ్పిటిసి నేడు సమావేశం లో అల్లరి చేయడానికి వచ్చినట్లు ఉందని ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా పలువురు దేశం సర్పంచులు జడ్పీటీసీపై ఎదురు దాడి చేశారు. సమావేశాలు పక్కదారి పట్టకుండా గ్రామ సమస్యలపై మాట్లాడాలని ఎంపీపీ రెడ్డి జగన్మోహన్ చేసిన సూచనలను కూడా జడ్పిటిసి పట్టించుకోకుండా ఎంపీపీ పైనే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే బండారు అధికారులను ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ సభను నడిపించేలా చర్యలు చేపట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందని ఎంఈఓ సత్యనారాయణ చెబుతుండగా ఏ కోడూరు హైస్కూల్లో 150 మంది విద్యార్థులు ఎందుకు తగ్గారని జడ్పిటిసి ప్రశ్నించారు. ఎవరో ఇచ్చిన తప్పుడు సమాచారంతో మాట్లాడుతున్నారని ఏ కోడూరు హైస్కూల్లో కూడా అధికంగా విద్యార్థులు చేరారని ఎంఈఓ బదులిచ్చారు. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో విద్యుత్ రేట్లు ఎక్కడ పెరగలేదని గత వైకాపా ప్రభుత్వంలో నే పెరిగాయని 2019 నుండి 2024 వరకు గణాంకాలు పరిశీలించవలసిందిగా వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ రొంగలి మహేష్ అన్నారు. ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ ప్రతి ఒక్క రైతుకు యూరియా సక్రమంగా అందేటట్లు వ్యవసాయ అధికారి చూసుకోవాలన్నారు . రైతులు నానో యూరియా వాడకాన్ని ప్రోత్సహించేలా అందరం కృషి చేయవలసిన బాధ్యత ఉందని అన్నారు. మండలంలో అసంపూర్తి భవనాలకు, ఇతర మౌలిక సదుపాయాలకు ప్రతిపాదనలు తయారు చేసి పంపాల్సిందిగా ఎమ్మెల్యే అధికారులను కోరారు. ఈ సమావేశంలో ఎంపీడీవో సాంబశివరావు తహసీల్దార్ భుజంగరావు పలువురు ఎంపీటీసీలు సర్పంచులు పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్లపై విజిలెన్స్ విచారణ పారదర్శకంగా జరిపించాలి

వైసిపి జిల్లా అధికార ప్రతినిధి దగ్గుపల్లి సాయిబాబా

విశాలాంధ్ర-పాయకరావుపేట: పాయకరావుపేట పట్టణంలో ఎటువంటి అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా వేసిన లేఅవుట్లు, పంచాయితీ కమ్యూనిటీ స్థలాల ఆక్రమణపై విజిలెన్స్ విచారణ పారదర్శకంగా నిర్వహించాలని వైసిపి జిల్లా అధికార ప్రతినిధి దగ్గుపల్లి సాయిబాబా డిమాండ్ చేశారు. స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గత 15 సంవత్సరాలలో పాయకరావుపేటలో సుమారు 200 ఎకరాలలో లేఅవుట్లు వేశారని తెలిపారు. ఎకరాకు 10 శాతం చొప్పున లేవట్లలో సుమారు 20 ఎకరాల్లో పంచాయతీ స్థలాలు ఉండాల్సి ఉందన్నారు. అయితే కనీసం రెండు ఎకరాలు లేని దుస్థితి ఉందన్నారు. లేఅవుట్లలో పంచాయతీ స్థలాలు ఆక్రమణకు గురి అయ్యాయని తెలిపారు. అక్రమ లేఅవుట్లు వేస్తున్న, పంచాయతీకి కేటాయించిన స్థలాలు ఆక్రమిస్తున్న అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. అక్రమ లేఅవుట్లు వేయడానికి, పంచాయతీ స్థలాలు ఆక్రమించడానికి సహకరించిన, ఎటువంటి చర్యలు తీసుకోలేని అధికారులపై జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అక్రమ లేఅవుట్లపై రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత విజిలెన్స్ విచారణ చేయిస్తానని ప్రకటించారని, విజిలెన్స్ విచారణ పార్టీలకతీతంగా, ఆక్రమణదారులకు వెనుక ఎవరు ఉన్నా చర్యలు తీసుకోవాలని, పంచాయితీ స్థలాలు సంరక్షించాలని, భూ యజమానులు దగ్గర్నుంచి పంచాయతీకి కేటాయించిన స్థలాలను పంచాయితీకి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, ఇళ్ళు నిర్మించుకునే ప్రజలకు బెటర్మెంట్ చార్జీల నుండి విముక్తి కలిగించాలని దగ్గుపల్లి సాయిబాబా డిమాండ్ చేశారు.

పౌష్టిక ఆహారంతో సంపూర్ణ ఆరోగ్యం...

విశాలాంధ్ర-కోటవురట్ల: ప్రతి ఒక్కరూ పోషకాలతో కూడిన పౌష్టిక ఆహారాన్ని సేవించి నట్లయితే సంపూర్ణమైన ఆహారాన్ని పొంద గలరని బికేపల్లి సర్పంచ్, మండల తెదేపా అధ్యక్షులు పెట్ల లింగన్న నాయుడు అన్నారు. సోమవారం బికేపల్లి గ్రామంలో ఉన్న అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహార వారోత్స వాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆరోగ్య నియమాలను పాటిస్తూ పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. ఐరన్ ఎక్కువగా ఉండే పదార్థాలు పాలు, గుడ్లు, ఆకుకూ రలు, పప్పు దినుసులతో కూడిన ఆహారాన్ని పిల్లలు, యుక్త వయసువారు, మహిళలు తీసుకోవాలన్నారు. ప్రతి గ్రామంలోని అంగన్వాడి, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, ఆశా కార్యకర్తలు ర్యాలీలు నిర్వహించి పౌష్టికాహారాన్ని సేవించడం పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు కలిగిన ఆహారాన్ని తయారుచేసి తీసుకోవాలన్నారు. అనంతరం పౌష్టికాహార వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి రామారావు, ఐసిడిఎస్ సూపర్వైజర్ హైమావతి, ఎంపీపీ స్కూల్ హెచ్ఎం, అంగన్వాడి కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, కిషోర్ బాలికలు, మహిళలు పాల్గొన్నారు.

81వ వార్డు లో ఎమ్మెల్యే కొణతాల సుడిగాలి పర్యటన

విశాలాంధ్ర-అనకాపల్లి: జీవీఎంసీ 81వ డివిజన్లో శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ సోమవారం సుడిగాలి పర్యటన చేశారు. జోనల్ కమిషనర్ , సిబ్బంది తో కలిసి ఇండోర్ స్టేడియం శ్రీ నూకాంబిక అమ్మవారి ఆలయ సమీపంలో ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్న మరిడిమాంబ అమ్మవారి ఆలయ పరిసర ప్రాంతాలలో రోడ్లు డ్రైనేజీలు నిర్మాణాలు, ప్రసిద్ధి చెందిన గవరపాలెం పరమేశ్వరి పార్క్ అభివృద్ధి చేయుటకు , పరమేశ్వరి పార్క్ అనుకొని ఉన్న వాటర్షెడ్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇండోర్ స్టేడియంలో అసంపూర్తిగా మిగిలి ఉన్న పనులను పూర్తి చేయమని అధికారులను ఆదేశించారు. మరిడిమాంబ అమ్మవారి ఆలయ పరిసరాలలో అభివృద్ధి చెందుతున్న ప్రాంతంలో రైతులతో మాట్లాడి రోడ్లు డ్రైనేజీ నిర్మాణానికి సహకరించవలసిందిగా కోరారు. అనంతరం గవరపాలెం పరమేశ్వరి పార్కులో మౌలిక వసతులకు త్రాగనీరుకు, ఆర్వో ప్లాంట్, టాయిలెట్ శుభ్రపరచాలని, పార్కు చివర్లో లైట్లు సరిగ్గా పనిచేయట్లేదని వెంటనే వాటిని మరమ్మత్తు చేసి పార్కును అభివృద్ధి చేయాలని అధికారులను సూచించారు. పార్కు ను ఆనుకొని ఉన్న వాటర్ ట్యాంక్ సమీపంలో ఉన్న స్థలంలో జీవీఎంసీ వారి ఆధ్వర్యంలో స్విమ్మింగ్ పూల్ ఏర్పాటు చేయాలని సూచించారు. స్విమ్మింగ్ పూల్ నిర్మాణ పనులను పూర్తి చేసి ప్రజలకు అందించాలని కోరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ. గత వారంలో ఆర్వో ఆఫీసులో జరిగిన జీవీఎంసీ అధికారులతో రివ్యూ కార్యక్రమం సందర్భంగా పట్టణ పరిధిలో గల అభివృద్ధి పనుల గురించి చర్చించడం జరిగిందని అన్నారు. గతంలో ఆగిపోయిన అభివృద్ధి పనులను పూర్తి చేస్తామని ఆయన విలేకరుల సమావేశంలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో , ఏసిపి, టిపిఓ , సిబ్బంది స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం

విశాలాంధ్ర-నక్కపల్లి: అంతర్జాతీయ అక్షరాస్యత సందర్భంగా సోమవారం స్థానిక నక్కపల్లి బాలుర ఉన్నత పాఠశాలలో వయోజన విద్య ఏడి చిన్ని కృష్ణ గారు ముఖ్య అతిథిగా హై స్కూల్ హెచ్ఎం పి విజయ ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా దేవర సత్యనారాయణ మార్కెట్ కమిటీ చైర్మన్ మరియు వైస్ ఎంపీపీ వీసం నానాజీ, గింజల లక్ష్మణరావు, ప్రత్యేక అతిధులుగా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. మండల అభివృద్ధి అధికారి సీతారామరాజు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముందుగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్య యొక్క ఆవశ్యకతను వారు వివరించారు. వయోజన విద్యకు సంబంధించిన బ్రోచర్ ఏడి చిన్ని కృష్ణ తదితర అధికారులు చేతుల మీదుగా ఆవిష్కరించారు.. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు కే నరేష్ , అడ్డూరి శ్రీను రుతల నాగన్న దొర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డెక్కన్ రెమెడీస్ ఫార్మాలో కార్మికుడు మృతి

కార్మిక కుటుంబానికి కోటి రూపాయల పరిహారం చెల్లించాలి : సిటూ



విశాలాంధ్ర-పరవాడ: జవహర్లాల్ నెహ్రూ ఫార్మాసిటీలోని ఫార్మా డెక్కన్ రెమెడీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో ఈనెల 5వ తేదీన ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో సీనియర్ కెమిస్ట్ ఎం.పోల్ నాయుడు (41) తీవ్రంగా గాయపడ్డాడు. అప్పటి నుంచి అతను ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారు జామున మృతి చెందాడు. ప్రమాదం జరిగిన విషయాన్ని యాజమాన్యం గోప్యంగా ఉంచడంపై కార్మిక నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా దీనిపై సమగ్ర విచారణ చేసి కార్మిక కుటుంబానికి కోటి రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ సిఐటియు గౌరవ అధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. గనిశెట్టి సోమవారం కంపెనీలో ప్రమాదానికి గురైన ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన పరిశ్రమ గేటు వద్ద మీడియాతో మాట్లాడారు. యాజమాన్యం నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమని మండిపడ్డారు. భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వలన ఒక నిండు ప్రాణం బలైందని ఆవేదన వ్యక్తం చేశారు. భద్రత ప్రమాణాలు పాటించాలని, కార్మికులకు రక్షణ భద్రత సంక్షేమం అమలు చేయాలని గనిశెట్టి డిమాండ్ చేశారు. యాజమాన్యం విషయాన్ని గోప్యంగా ఉంచడం పట్ల గనిశెట్టి ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిశ్రమలో భద్రత ఆడిట్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. కోటి రూపాయలు నష్ట పరిహారం చెల్లించడంతోపాటు కుటుంబంలో ఒకరికి పర్మినెంట్ ఉద్యోగం ఇవ్వాలని, యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేస్తున్నట్లు గనిశెట్టి తెలిపారు.

దివ్యాంగ విద్యార్థులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్

విశాలాంధ్ర -యలమంచిలి: దివ్యాంగ విద్యార్థులకు ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందని యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ అన్నారు. సోమవారం పట్నంలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం దివ్యాంగ విద్యార్థులకు మెడికల్ క్యాంపులో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థుల సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు శ్రీనివాసరావు, అరుణ్ కుమార్, నాలుగు మండలాల భవిత పాఠశాల ఉపాధ్యాయులు మూర్తి, అనురాధ, జగదాంబ, శైలజ, చిట్టిబాబు, సుమతి, జువ్వాది, వికలాంగుల విద్యార్థులు, తల్లిదండ్రులు, సహాయకులు పాల్గొన్నారు.

ఎస్సైలుగా పదోన్నతి పొందిన నలుగురు ఏఎస్సైలు

విశాలాంధ్ర-అనకాపల్లి: జిల్లాలో ఏఎస్సైగా సేవలందిస్తున్న ఎం.డి.వై. మొహిద్దీన్, ఆర్.వి.రామనాయుడు, వి.శంకరరావు, ఎం.రాజారావులకు విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి, ఎస్సైలుగా పదోన్నతి కల్పిం చిన సందర్భంగా వారు ఎస్పీ తుహిన్ సిన్హా ను మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ వారిని అభినం దిస్తూ జిల్లాలో మీరు వివిధ హెూదాల్లో విధులు నిర్వర్తిస్తూ శాంతిభద్రతల పరిరక్షణలో విశేష కృషి చేశారని మీ నిబద్ధత, కష్టపడి పనిచేసే తత్వం సహచరులకు ఆదర్శప్రాయంగా నిలుస్తోంది. పదోన్నతి అనంతరం మరింత బాధ్యతలతో ప్రజలకు సేవలు అందిస్తారని నమ్ముతున్నానని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి, పోలీస్ శాఖ ప్రతిష్ఠను మరింతగా పెంచాలని ఆకాంక్షించారు.

అసత్య ప్రచారంపై పోలీసులకు ఫిర్యాదు



విశాలాంధ్ర-పరవాడ: పెందుర్తి ఎమ్మెల్యే పైనా, ఎమ్మెల్యే సోదరుడు పైనా వాట్సాప్ గ్రూప్ వేదికగా నిరాధార పోస్టులు పెట్టి అసత్య ప్రచారం చేస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని జనసేన మండల పార్టీ అధ్యక్షుడు బొద్దపు శ్రీనివాసరావు పరవాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆయన పలువురు నాయకులతో కలిసి సోమవారం ఎస్సై కృష్ణారావును కలిసి ఫిర్యాదు చేశారు. లిక్కర్ స్కాంలో ఎమ్మెల్యే, అతని సోదరులు ఉన్నట్లు నిరాధారమైన పోస్టులు పెట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అసత్య ప్రచారం చేస్తున్న ఈ వ్యక్తిపై ఇదివరకే తహసిల్దార్, సర్కిల్ ఇన్స్పెక్టర్ పై కూడా ఇలాంటి పోస్టులే పెట్టాడని, దీంతో ఆ వ్యక్తిపై రెండు కేసులు నమోదు చేసి జైలుకు పంపించారని వెల్లడించారు. ఇతనితో పాటు గ్రూప్ అడ్మిన్ పైనా చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో కూటమి నాయకులు వియ్యపు చిన్న, బుగుడి రామ గోవిందరావు, గొంతిన రాము, వెన్నెల నర్సింగరావు, మోటూరి హరిబాబు తదితరులు ఉన్నారు.

గొలుగొండ తహశీల్దార్‌పై చర్యలు తీసుకోవాలి



విశాలాంధ్ర -వి.మాడుగుల: గొలుగొండ తహశీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని సోమవారం మాడుగుల మండలానికి చెందిన ఆదివాసీలు మాడుగులలో ప్రదర్శన నిర్వహించారు. గొలుగొండ తహశీల్దార్‌గా పని చేస్తున్న శ్రీనివాసరావు అక్రమాలపై రెవెన్యూ విజిలెన్స్ విభాగం విచారణ జరపమని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ ఆదేశాలను అమలువరుస్తూ వెంటనే ఒక విచారణ అధికారిని నియమించాలని జిల్లా స్థాయిలో ఆదివాసీలు చేసిన ఉద్యమంలో భాగంగా మాడుగుల మండలం ఆదివాసీలు సంఘీభావంగా ఈ ర్యాలీ నిర్వహించాము. గొలుగొండ మండలం పాత మల్లంపేటలో ఆదివాసీల సాగు అనుభవంలో ఉన్న భూములను ఎలాంటి విచారణ లేకుండా, సాగులో ఉన్న వారికి ఎలాంటి నోటీసు ఇవ్వకుండా తహశీల్దార్ పీ.శ్రీనివాసరావు భారీ ఎత్తున లంచాలకు ఆశపడి రికార్డులను ఏకపక్షంగా మార్చి వేశాడు. దీనిపై ఆదివాసీలు ఇచ్చిన నిర్దిష్టమైన ఫిర్యాదులను పురస్కరించుకొని విచారణ జరపమని గిరిజన సంక్షేమ శాఖ, రెవెన్యూ శాఖ, భూ పరిపాలన కమిషనర్ కార్యాలయం, జాతీయ కమిషన్ ఆదేశాలు ఇచ్చినప్పటికీ ఈరోజు వరకు విచారణ అధికారిని జిల్లా కలెక్టర్ కార్యాలయం నియమించలేదన్నారు. ఈ నెలలో పదవీ విరమణ చేస్తున్న గొలుగొండ తహశీల్దార్ పాల్పడిన అక్రమాలకు సంబంధించిన ఫైళ్లను మాయం చేసే అవకాశం ఉందని ఆదివాసీలు ఆందోళన చెందుతున్నారు. కనుక పాత మల్లంపేట కు సంబంధించిన రికార్డు మార్పుల ఫైల్ అన్నిం టిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. తరతరాలుగా సాగు అనుభవంలో ఉన్న ఆదివాసీలకు ఎలాంటి సమాచారం లేకుండా ఏకపక్షంగా నర్సీపట్నం రెవిన్యూ డివిజన్ పరిధిలో రికార్డులు మార్చేస్తున్నారు. రికార్డ్ ఆఫ్ రైట్స్ చట్టం ప్రకారం ఇవ్వవలసిన నోటీసులు కూడా ఇవ్వటం లేదు. కొన్ని సందర్భాలలో గ్రామ పరిపాలన అధికారి, రెవిన్యూ ఇన్‌స్పెక్టర్లు నివేదిక లేకుండానే రికార్డులు మార్చేస్తున్నారు.తహశీల్దార్ శ్రీనివాసరావు పాల్పడు తున్న అక్రమాలపై ఏప్రిల్ 28వ తేదీన నర్సీపట్నం సబ్ కలెక్టర్ కార్యాల యానికి వచ్చిన జిల్లా జాయింట్ కలెక్టర్‌కి ఆదివాసీలు తమ ఫిర్యాదులను సమర్పించారు. దీనిపై జులై 12 లోపల విచారణ చేయాలని జాయింట్ కలెక్టర్ ఆదేశాలు ఇచ్చినప్పటికీ ఈరోజు వరకు విచారణ జరగలేదు. సెప్టెంబర్ నాలుగు నుండి 15వ తేదీ వరకు మండల స్థాయిలో ఆదివాసీలు నిరసన తెలియజేస్తూ ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. అప్పటికి జిల్లా కలెక్టర్ గారు స్పందించి ప్రత్యేక విచారణ అధికారిని నియమించకపోతే సెప్టెంబర్ 22వ తేదీన చలో నర్సీపట్నం కార్యక్రమాన్ని నిర్వహిస్తాం. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఆదివాసి సంఘం మండల కన్వీనర్ మోసూరీ రాజు, కో కన్వీనర్ తుర్రే రవి దీనికి నాయకత్వం వహించారు. మోసూరి రాజు పాల్గొన్నారు.

మండల తెలుగు యువత అధ్యక్షుడిగా పాలమరశెట్టి మోహన్ రావు

విశాలాంధ్ర-మునగపాక: మునగపాక మండల తెలుగు యువత అధ్యక్షుడిగా పొలమరశెట్టి మోహన్ రావు ఎన్నికయ్యారు.మునగపాక మండలం తెలుగు యువత అధ్యక్షులుగా టి.సిరసపల్లి గ్రామానికి చెందిన పోలమరశెట్టి మోహన్ రావుని,యలమంచిలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ శ్రీ ప్రగడ నాగేశ్వరరావు పర్యవేక్షణలో మునగపాక మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పెంటకోట విజయ్ నియమించడం జరిగింది.తెలుగుదేశం పార్టీలో యువతకు ప్రముఖ స్థానం ఇస్తుందని, మునగపాక మండలంలో తెలుగుదేశం పార్టీని మరింత విస్తృతపరచాలని,యువకులు రాజకీయాలకు రావడమే ద్వారా మంచి నాయకత్వం,నియోజవర్గ ఇంచార్జ్ ప్రగడ నాగేశ్వరరావు తెలిపారు.అలాగే తెలుగు యువత అధ్యక్షులుగా నియమింపబడ్డ పోలమరశెట్టి మోహన్ రావు నియోజకవర్గ పెద్దలు మాజీ పార్లమెంట్ సభ్యులు పప్పుల చలపతిరావురావుకి,యలమంచిలి నియోజవర్గ టిడిపి ఇన్చార్జ్ ప్రగడ నాగేశ్వరావుకి ధన్యవాదములు తెలిపారు. ..

రైతుకు యూరి'యాతన'...

- నల్ల బజారుకు తరలిస్తూ కృత్రిమ కొరత సృష్టిస్తున్న వ్యాపారులు
- అధిక ధరలతో అన్నదాత బతుకులతో ఆటలు ..
- తక్షణమే చర్యలు తీసుకోవాలి - ఏపీ రైతు సంఘం

విశాలాంధ్ర-చోడవరం : ఎరువులు విత్తనాలు కల్తీ తో పాటు నల్ల బజారుకు తరలిస్తూ, కొందరు వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టిస్తూ, అధిక ధరలకు విక్రయిస్తూ అన్నదాత బతుకులతో ఆటలాడుతున్నారని ఏ.పీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు సోమవారం మీడియాకు విడుదల చేసిన ఓ ప్రకటనలో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అమ్మే ప్రైవేటు వ్యాపారుల చర్యలతో అన్నదాతలను యూరి'యాతన' వెంటాడుతోందని తెలిపారు. ఎరువులు విత్తనాలు వ్యాపారులను నియంత్రణ చేసే వ్యవసాయ అధికార యంత్రాంగం, వ్యాపారులు ఇచ్చే లంచా లతో మొద్దు నిద్ర నటిస్తుండడంతో, తప్పనిసరి పరిస్థితుల్లో అధిక ధరలకు యూరియా కోసం ప్రైవేటు దుకాణాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. ప్రతీ ఏడాది వ్యవసాయ గణాంకాల ప్రకారం ఏ పంట ఏ మేర సాగవుతుందో, వాటికి కావలసిన వ్యవసాయాధికారిక ఎరువుల లెక్కలు ఏమవుతున్నాయని ప్రశ్నిస్తున్నారు. బహిరంగ మార్కెట్లో ప్రతి ఏడాది ఎరువులు, విత్తనాలు విక్రయించే దుకాణాలు పెరుగుతున్నాయే తప్ప రైతాంగానికి కావలసిన సమయంలో, వ్యవసాయాధికారుల సహకారంతో వ్యాపారుల ఇష్టారాజ్యంగా

అధిక ధరలకు అమ్ముతూ యదేచ్ఛగా అన్నదాతలను అప్పుల పాలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఏడాదికేడాది పెట్టుబడి ఖర్చులు మితిమీరి పెరుగుతుం డడంతో వ్యవసాయదారులు కూలీలుగా మారుతున్నారని తెలిపారు. ప్రభుత్వము, పాలకులు వ్యవసాయా ధికారులు ఇదే విధానం కొనసాగిస్తే కొద్ది రోజుల్లో వ్యవసాయం కనుమరుగయ్యే ప్రమాదం ఏర్పడుతుందని హెచ్చరించారు. జిల్లా వ్యవసాయ ఉన్నతాధికారులు ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు అధిక ధరలకు నల్ల బజారులో అమ్మే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకొని వారి లైసెన్సులు రద్దు చేస్తే తప్ప అన్నదాత కన్నీళ్లు ఆగవని కార్మిక, కర్షక నేత రెడ్డిపల్లి స్పష్టం చేశారు.

వెంకటనగరం జగనన్న కాలనీలో ట్రాన్స్ ఫార్మర్లు ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర -పాయకరావుపేట: మండలంలోని వెంకటనగరం గ్రామంలోని జగనన్న కాలనీలో మినీ ట్రాన్స్ ఫార్మర్లు ఏర్పాటు చేయాలని ఆ ప్రాంత వాసులు కోరుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇళ్ల స్థలాలు మంజూరు చేశారని, ఇళ్ళు నిర్మించుకుంటున్న లబ్ధిదారుల కోసం 6 మినీ ట్రాన్స్ ఫార్మర్లు ఏర్పాటు చేశారని తెలిపారు. అయితే ఏడాది క్రితం లోడ్ ఎక్కువగా ఉందంటూ విద్యుత్ అధికారులు జగనన్న కాలనీలో వేసిన మినీ ట్రాన్స్ ఫార్మర్లు తీసివేసి వేరే ప్రదేశంలో వేశారని తెలిపారు. దీని కారణంగా కాలనీలో ఒక ట్రాన్స్ ఫార్మర్ మాత్రమే ఉందని, లో వోల్టేజ్ సమస్య వచ్చి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆ ప్రాంత వాసులు చెబుతున్నారు. తాము పడుతున్న ఇబ్బందులు విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోలేదని, ఇప్పటికైనా విద్యుత్ అధికారులు ట్రాన్స్ ఫార్మర్లు ఏర్పాటు చేయాలని గరికిన నరసమ్మ, పి. శేషగిరి, ఎం.కవిత, ఎం.అమ్మాజీ, సుజాత, రమణమ్మ, లక్ష్మి తదితరులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై విద్యుత్ శాఖ ఏఈ లక్ష్మీనారాయణ ను వివరణ కోరగా జగనన్న కాలనీలో లోడ్ అవసరం కోసం విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లు వేసిన మాట వాస్తవమేనని, అయితే లోడ్ లేని కారణంగా వేరే ప్రాంతానికి ట్రాన్స్ ఫార్మర్లు మార్చామని తెలిపారు. లో వోల్టేజ్ సమస్య ఉందని, అదనంగా విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లు వెయ్యాలని ఆ ప్రాంతవాసులు కోరారని, అయితే లో వోల్టేజ్ ఎందుకు వస్తుందో పరిశీలించి సమస్య పరిష్కరిస్తామని, అవసరమైతే ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేస్తామని తెలిపారు.

అన్నదాత పోరు రైతన్నకు బాసటగా వైసీపీ

విశాలాంధ్ర-అచ్యుతాపురం : యూరియా కొరతతో ఆందోళన చెందుతున్న రైతులు నేపథ్యంలో మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి ఈనెల 9న తలపెట్టిన రైతన్నల పోరుబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైసిపి మండల నాయకులు కోరారు . సోమవారం వైయస్ ఆర్ సీపీ మండల పార్టీ కార్యాలయం ఆవరణంలో యూరియా కొరతపై అన్నదాత పోరు రైతన్నకు బాసటగా వైసిపి మండల నాయకులు పోస్టర్స్ విడుదల చేశారు . ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ కోనా సంధ్య బుజ్జి , కో జడ్పిటిసి నర్మాల కుమార్ , ఎంపీటీసీ జువ్వాలనాయుడు , బలిరెడ్డి శ్రీను , సర్పంచ్లు గొర్లె అశ్విని నూకరాజు , లాలం వాణి వాసు , కూండ్రపు సత్యరావు , నియోజవర్గ వైసిపి యువజన అధ్యక్షులు సింహాద్రి బుజ్జి , మాడెం సూరి అప్పారావు , పంచదార్ల పైడ్రాజు , కొమ్మోజు ఈశ్వరరావు , పంచదార్ల రవి , పంచదార్ల చిన్న , మోటూరు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు .

.. 9న అనకాపల్లిలో అన్నదాత పోరు

విజయవంతానికి వైసీపీ నేత కరణం ధర్మశ్రీ పిలుపు

విశాలాంధ్ర- యలమం చిలి: యూరియా కొరతను నియంత్రించి, బ్లాక్ మార్కెట్ అరికట్టి రైతులకు న్యాయం చేకూర్చాలని తలపెట్టిన అన్నదాత పోరు నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అనకాపల్లి ఎంపీ నియోజకవర్గం వైసిపి ఇన్చార్జి, యలమంచిలి నియోజకవర్గం సమన్వయ కర్త కరణం ధర్మశ్రీ పిలుపునిచ్చారు. సోమవారం యలమంచిలి పట్టణంలో వైసీపీ కార్యాలయంలో అన్నదాత పోరు పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతుకు అవసరమైనప్పుడు ఎరువులు కొరత లేకుండా చూసే బాధ్యత ప్రభుత్వానిదేనని, రైతులకు పంటల భీమా, పంటకు నష్ట పరిహారం పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈనెల 9వ తేదీ మంగళవారం అనకాపల్లిలో తలపెట్టిన అన్నదాత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ నాయకులను కార్యకర్తలను ఆయన కోరారు. యలమంచిలి నియోజకవర్గం నుంచి వెయ్యి మందికి తక్కువ లేకుండా ఈ కార్యక్రమానికి హాజరుకావాలని సూచించారు. ఈ నిరసన కార్యక్రమానికి రైతు సంఘం కూడా మద్దతు తెలుపుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బోధిపు గోవింద్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బొద్దపు ఎర్రయ్య దొర, మున్సిపల్ వైస్ చైర్మన్ లు బెజవాడ నాగేశ్వరరావు, అరేపు గుప్తా, మండల పార్టీ అధ్యక్షులు కొల్లి త్రినాధ్, కౌన్సిలర్లు రాపేటి సంతోష్, దూది నరసింహమూర్తి, దుంగ అచ్యుతరావు, వైసీపీ నాయకులు దాసరి కుమార్, కోడుగుడ్డు రమణ, కొటారు కొండబాబు, పాత్రౌతు నర్సింగరావు, మడగల సత్యనారాయణ, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

9న దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాల గుర్తింపు శిబిరం

విశాలాంధ్ర -పాయకరావుపేట: ఈనెల 9వ తేదీన పాయకరావుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండలంలో వివిధ పాఠశాలల్లో చదువుతున్న దివ్యాంగ విద్యార్థుల వైకల్య నిర్ధారణ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి జి.రమేష్ బాబు తెలిపారు. ఈ శిబిరంలో 0 -18 సంవత్సరాల వయస్సు కలిగిన దివ్యాంగ విద్యార్థుల ప్రత్యేక అవసరాలను గుర్తిస్తారని తెలిపారు. వారికి అవసరమైన వినికిడి యంత్రాలు, వీల్ చైర్లు, ట్రై సైకిళ్లు, రోలేటర్స్, బ్యాటరీ ట్రై సైకిల్స్ వంటి ఉపకరణాలు అందజేస్తారని తెలిపారు. ఉపకరణాలు పొందే విద్యార్థులు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, సదరం సర్టిఫికెట్, ఆదాయ ధ్రువ పత్రం, రెండు పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు తీసుకు రావాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రమేష్ బాబు కోరారు.

సుజాతకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఎంపిక

విశాలాంధ్ర-వి. మాడుగుల : మాడుగుల ఆర్సిఎం పాఠశాలలో 10 ఏళ్ల పాటు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించి ఇక్కడ నుండి విశాఖపట్నంలో గల యారాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న గద్దం మేరీ సుజాత జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఎంపిక కాబడి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. మచిలీపట్నంలో జన్మించిన ఈమె 1997లో మాడుగుల ఆర్సిఎం.పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తూ కేవలం బోధనకే పరిమితం కాకుండా నిరుపేదల సాధక బాధలను గుర్తించి వారికి తగిన విధంగా ఆర్థిక సహాయం చేయడమేకాకుండా వారికి విద్యపై మరింత శ్రద్ధను పెంపొందేలా కఋషి చేసేవారు. అప్పటిలోనే ఈమెకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలుగా అవార్డు లభించింది. తదుపరి ఇక్కడి నుండి బదిలీ కాబడి వివిధ పాఠశాలల్లో పని చేసి గత ఏడాది యారాడ జిల్లా పరిషత్ పాఠశాలకు బదిలీ కాబడింది. ఈమె సేవలను గుర్తించి ఈనెల 5వ తేదీన విజయవాడలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలుగా అవార్డు అందుకున్నారు. ఈమెకు ఈ అవార్డు రావడం పట్ల మాడుగుల మాజీ సర్పంచ్ దంగేటిసూర్యారావు, బసవ రామ పరమేష్, పద్దాది చందన్, కోడూరు కొండలరావు, దంగేటి వరలక్ష్మి, ప్రశాంతి, ఇంకా పలువురు విశ్రాంత ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

అమ్మతపురంలో ప్రభుత్వ భూమి స్వాధీనం

విశాలాంధ్ర -సబ్బవరం: మండలంలోని అమృతపురం రెవెన్యూ పరిధిలో గల సర్వేనెంబర్ 379 లో సుమారు 35 ఎకరాల 64 సెంట్లు ప్రభుత్వ భూమి (గయాలు) నందు ఆక్రమణలు తొలగించి తాసిల్దార్ బి. చిన్నికృష్ణ ఆదేశాల మేరకు స్వాధీనం చేసుకున్నట్లు స్థానిక ఆర్ ఐ బి. వీరయ్య తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డులు సోమవారం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ప్రభుత్వ భూమిని ఎవరైనా ఆక్రమించినా, నిర్మాణాలు చేపట్టినా వారిపై చట్టపరమైన క్రిమినల్ చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో జగన్నాథం, వీఆర్ఏ, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చేదెక్కిన చెరకు రైతు బ్రతుకు - ఏ.పి.రైతు సంఘం

- చెరకు సాగు వద్దు, మొక్కజొన్న ముద్దు అంటూ ప్రచారం చేస్తున్న పాలకులు
- గోవాడ సుగర్స్ రైతులు, కార్మికులకు బకాయిలు తక్షణమే చెల్లించాలి

విశాలాంధ్ర-చోడవరం: చెరకు సాగు వద్దు, మొక్కజొన్న ముద్దు అంటూ చోడవరం మాడుగుల ఎమ్మెల్యేలు చేస్తున్న ప్రచారంతో చెరుకు రైతు బతుకు చేదెక్కిందని, సహకార రంగంలో అగ్రగామిగా నిలిచిన ది.చోడవరం (గోవాడ) సుగర్స్ లో కార్మికులు, కర్షకులకు బకాయిలు చెల్లించకుండా పాలకులు కొత్త నాటకానికి తెర ఎత్తారంటూ ఏపీ రైతు సంఘం ఆరోపిస్తోంది. ఈ మేరకు గోవాడ ఫ్యాక్టరీ సమస్యలపై ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు సోమవారం మీడియాతో సమావేశమయ్యారు. ఈ ఏడాది ఫ్యాక్టరీలో క్రషింగ్ ... జరుపుతున్నది, లేనిది తెలియపరచాలని ఏ.పి. జిల్లా రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు డిమాండ్ చేశారు. ఫ్యాక్టరీలో గతేదాది క్రషింగ్ చేసిన రైతులకు నేటి వరకు పేమెంట్లు చేయలేదని, కార్మికులకు సుమారు ఆరు నెలలకు పైగా జీతాలు చెల్లించకుండా ఫ్యాక్టరీని నిర్వీర్యం చేయాలనే దురాలోచనతో ప్రభుత్వ పాలకులు, ఫ్యాక్టరీ యాజమాన్యం కార్మిక కర్షకుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని ఆరోపించారు. గత మేనేజింగ్ డైరెక్టర్ ఫ్యాక్టరీని పూర్తిగా నాశనం చేశారన్నారు. అనకాపల్లి ఎంపీ, జిల్లా ఇన్చార్జి మంత్రి కొల్లు రవీంద్ర, మాడుగుల, చోడవరం ఎమ్మెల్యేలు కె.ఎస్.ఎన్.ఎస్.రాజు, బండారు లు గత సీజన్లో షుగర్ ఫ్యాక్టరీకు పూర్వవైభవం తీసుకువచ్చి లాభాల బాటలో తీసుకొస్తామని, హామీలు ఇచ్చి, నేటికీ వాటిని నెరవేర్చకుండా జాప్యం చేస్తూ, గోవాడ సుగర్స్ నుమరింత అధోగతపాలు చేస్తున్నారని అన్నారు. ఇది ఇలాగే కొనసాగితే రానున్న క్రషింగ్ సీజన్ కు ఫ్యాక్టరీ లో క్రషింగ్ జరుపుతారా లేదా చెరుకు నాట్లు వేయాలా వద్దా అనే ఆవేదనలో రైతాంగం ఉన్నారని తెలిపారు. రెండు నియోజక వర్గాల్లో సుమారు లక్షకు పైగా కార్మిక, కర్షక కుటుంబాలు... గోవాడ సుగర్స్ పై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడి జీవనం సాగిస్తున్నారని తెలియజేశారు. ఎన్నికల ముందు అధికార పార్టీ కూటమి నేతలు లక్షలాది కార్మిక కర్షక కుటుంబాలకు ఉపాధి హామీలు ఇచ్చి, వాటిని నెరవేర్చకుండా తూతూ మంత్రంగా కబుర్లు చెబుతూ కాలం వెళ్ళదీస్తున్నారని ఆరోపించారు. గోవాడ సుగర్స్ పై రైతాంగానికి భరోసా కల్పించి, సీఎం చంద్రబాబుతో కార్మిక కర్షకుల సమస్యలపై చర్చించి తక్షణమే 35 కోట్ల రూపాయలు తీసుకొచ్చి ఫ్యాక్టరీని ఆదుకోవాలని రెండు నియోజకవర్గాల ఎమ్మెల్యేలకు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్మికులకు కర్షకులకు బకాయిలు చెల్లించాలని, గోవాడ సుగర్స్ ను గాడిలో పెట్టి, .. కార్మిక కర్షక కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ, లేని పక్షంలో రైతులు కార్మికులతో షుగర్ ఫ్యాక్టరీని ముట్టడి చేస్తామని తెలియపరిచారు. లేనిచో కార్మిక, కర్షక కుటుంబాలతో రెండు నియోజకవర్గాల ఎమ్మెల్యే కార్యాలయాలను ముట్టడి చేసి భారీ ఆందోళన జరుపుతామని,. .. దీనికి అధికార కూటమి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సిందిగా తెలియజేశారు.

ఆదిత్యలో ఉచిత కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర- అనకాపల్లి : పట్టణంలో గల ఆదిత్య డిగ్రీ కళాశాల , అనకాపల్లి సిటీ ఐ కేర్ వారుసంయుక్తంగా సోమవారం "మానసిక ఆరోగ్యము, ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరం గురించి కళాశాల ప్రిన్సిపల్ డి. స్వాతి మనోజ్ కుమార్ మాట్లాడుతూ .అన్ని ఇంద్రియాలు కన్నా "నయనం ప్రధానం" అన్నారని అందువలన విద్యార్థులందరూ తప్పనిసరిగా ఎటువంటి ఆరోగ్య సమస్యలు రాకుండా జాగ్రత్త పడాలని ఎప్పటికప్పుడు ఇటువంటి శిబిరాలలో పాల్గొనాలని తెలియజేశారు. అనకాపల్లి సిటీ ఐ కేర్ డాక్టర్ వి. రాజ్ కుమార్ మాట్లాడుతూ. విద్యార్థులు కంటి పరీక్ష చేయించుకోవాలని ప్రస్తుత కాలంలో సరైన ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోకపోవడం వలన , మొబైల్ ని ఎక్కువగా వినియోగించడం వలన కంటి సమస్యలు సంభవిస్తాయని అన్నారు. నేటి పోటీప్రపంచంలో విద్యార్థులు మానసిక ఒత్తిడిని ఏ విధంగా ఎదుర్కోవాలో వివరించారు. విద్యార్థులకు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సి. హెచ్ మురళీధర్ , ఎన్.ఎస్.ఎస్ పీ.వోలు కే. వాసు, ఎన్.హేమ శ్రీ , కళాశాల సిబ్బంది , ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని నేనే.. అంతా తానే..

వైద్యులను డమ్మీలు చేస్తున్న హెల్త్ ఈవో

విశాలాంధ్ర-కే కోటపాడు : హెల్త్ వర్కర్ నుండి హెల్త్ ఈవో వరకు ప్రమోషన్లు పొంది స్థానికంగా ఉన్న రెండు పీహెచ్సీల్లో నే అటు ఇటు బదిలీలు చేసుకుంటూ కాలక్షేపం చేస్తున్న హెల్త్ ఈవో తీరుపై పలువురు విస్మయం చెందుతున్నారు. ఇందుకు ఉదాహరణగా సోమవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో వైద్య ఆరోగ్యానికి సంబంధించి లంక వాని పాలెం పిహెచ్సి వైద్యాధికారి డాక్టర్ శైలజ , చౌడువాడ పీహెచ్సీ వైద్యాధికారి డాక్టర్ మాలమ నాయుడు లను మాట్లాడనివ్వకుండా సభ్యుల ప్రశ్నలకు హెల్త్ ఈవో జవ్వాది సన్యాసిరావు సమాధానాలు చెప్పడం పలువురుకు ఆశ్చర్యం కలిగించింది. ఆరోగ్యశాఖకు సంబంధించి పలు ప్రశ్నలను ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఈ వ్యక్తి గురించి తెలియక పలుమార్లు డాక్టర్ గారు అంటూ సంబోధించినా తాను డాక్టర్ను కానని చెప్పకపోవడంతో అధికారులు ముక్కున వేలేసుకున్నారు. గత వైకాపా హయాంలో ఒకసారి సమావేశాలకు డాక్టర్ ముసుగులో వచ్చి సభ్యులకు సమాధానాలు ఇవ్వడంతో అక్కడే ఉన్న మాజీ ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు ఆగ్రహించి ఈ వ్యక్తిని బయటకు పంపించి వేశారు. శాఖాధిపతులు ప్రజాప్రతినిధులే ఉండాలని ఎంపీడీవో ప్రత్యేకంగా చెప్పినతరువాత కూడా సమావేశానికి డాక్టర్లు తో వచ్చి ఇద్దరు డాక్టర్లను పక్కన పెట్టి సమాధానాలు ఇవ్వడం సమంజసంగా లేదని పలువురు వ్యాఖ్యానించారు.

ఎస్సైను సత్కరించిన భారత నిర్మాణ సేవా ట్రస్ట్

విశాలాంధ్ర-వి.మాడుగుల: వినాయక ఉత్సవాలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్తలు తీసుకొని వినాయక నిమజ్జనంలో ఎటువంటి అల్లర్లు గొడవలు లేకుండా అన్ని ఏర్పాట్లు చేసిన మాడుగుల ఎస్సై జి.నారాయణరావును మాడుగులకు చెందిన భారత నిర్మాణ సేవా ట్రస్ట్ సభ్యులు సోమవారం ఘనంగా సాలువా కప్పి మెమొంటో అందించి సత్కరించారు. ప్రముఖ సిద్ధాంతి భమిడి పాటి సుబ్రహ్మణ్యశాస్త్రి సూచన మేరకు వినాయక చవితి చంద్ర గ్రహణం కారణంగా తొమ్మిది రోజులు పాటు మాత్రమే వినాయక ఉత్సవాలు నిర్వహించాలని తెలియజేయడంతో గ్రామంలో ఉన్న వినాయక ఉత్సవాలు ఏర్పాటు చేసిన నిర్వాహకులు 9 రాత్రులు అనంతరం వినాయక స్వామివారిని నిమజ్జనం చేసారు. అయితే ఈ తొమ్మిది రోజులు పాటు గ్రామంలో ఎక్కడా కూడా ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా గొడవలు అల్లర్లు లేకుండా పోలీసులు నిత్యం గ్రామంలో తిరుగుతూ నిమజ్జనం జరిగే సమయంలో ఎస్సై నారాయణ రావు ఆధ్వర్యంలో ముందు జాగ్రత్తలు తీసుకో వడంతో ఎటువంటి అల్లర్లు జరగలేదని ఆనందం వ్యక్తం చేస్తూ భారత నిర్మాణ సేవా ట్రస్ట్ సభ్యులు ఎస్ఐ నారాయణరావును ఘనంగా సాలువ కప్పి మెమొంటో అందించి సత్కరించారు. మీరు అందరూ సహకారం అందించడంతో వినాయక ఉత్సవాలు ఘనంగా జరిగాయని ఎస్ఐ అన్నారు. ఈ కార్యక్రమంలో భారత నిర్మాణ సేవా ట్రస్ట్ సభ్యులు గౌరీపట్టపు మహేష్ కుమార్, అల్లూరి సీతారామరాజు సేవా సంఘం అధ్యక్షులు మండల సతీష్, జాగాని ఈశ్వరరావు, పుట్టా బలరాం, మానేపల్లి రామకృష్ణ, పేలూరి కృష్ణారావు, మణికంత, చందు పాల్గొన్నారు.

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ విశాఖపట్నం జిల్లా ఇన్చార్జిగా కోటాన రాము

విశాలాంధ్ర-సబ్బవరం: వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ విశాఖపట్నం జిల్లా ఇన్చార్జిగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొటాన రాము ను నియమించినట్లు ఆయన తెలిపారు.వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రివర్యులు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఎమ్మెల్సీ రాచగొల్ల రమేష్ యాదవ్ కోటాన రామును నియమించడమైనది. ఈ సందర్భంగా కోటాన రాము మాట్లాడుతూ నాపై నమ్మకంతో నన్ను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ విశాఖపట్నం జిల్లా ఇన్చార్జిగా నియ మించినందుకు వైసిపి అధినేత మాజీ ముఖ్య మంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ రాచగొల్ల రమేష్ యాదవ్ కి, పెందుర్తి నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు అన్నమరెడ్డి అది రాజు ల కు ప్రత్యేక కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలియజేశారు.